## క్లుప్తంగా

### సాగునీటి సమస్యపై రైతుల నిరసన

**మామిడికుదురు:** మగటపల్లిలో సుమారు 150 ఎకరాల పంటకు సాగునీరు అందక చేలు ఎండిపోతున్నాయని రైతులు బుధవారం నిరసన తెలిపారు. సాగునీటి సరఫరాలో జాప్యం వల్ల పంట సాగు ఆలస్యమైందని ప్రస్తుతం పంట పాలు పోసుకునే దశలో ఉందని రైతులు వాపోయారు. ఈ పరిస్థితుల్లో తీవ్ర సాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. పంట పొలాలు నెర్రలు తీశాయని, పంట ఎండిపోతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

### వృద్ధులకు చీరల పంపిణీ

**అంబాజీపేట:** శ్రీరామనవమిని పురస్కరించుకుని స్వర్ణలత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ జె.రాంప్రసాద్ ఆధ్వర్యంలో అంబాజీపేట శివారు కొత్తపాలెంలో వృద్ధులకు చీరలను బుధవారం పంపిణీ చేశారు. మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరకొండ జాన్, కుడుపూడి సతీష్, పితాని వెంకటరమణ, కోట హనుమంతరావు, టి.సుదర్శన్, కోన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

### కుష్టు రోగులకు రొట్టెలు, పండ్ల పంపిణీ



కుష్టు రోగులకు రొట్టెలు, పండ్లు, వస్త్రాలు పంపిణీ చేస్తున్న అన్నపూర్ణ

**అయినవిల్లి:** సేవాతత్పరతతో పనిచేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణశ్రీనివాస్ దంపతులను నగరం మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అభినందించారు. బుధవారం అన్నపూర్ణ శ్రీనివాస్ దంపతులు విలస గ్రామంలోని మన్నా మినిస్ట్రీస్ న్యూ లైఫ్ సెంటర్ (కుష్ఠు, ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం)లో వ్యాధి పీడితులకు బ్రెడ్లు, పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనే గంగుమళ్ళ అన్నపూర్ణ, శ్రీనివాస్ దంపతులు అనేక సేవలు అందించారని అభినందించారు.

### వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

**అయినవిల్లి:** ఒంటరిగా ఉన్న ఓ వృద్ధ మహిళ ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో బంగారు గొలుసును బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఓ వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. దీనికి సంబంధించి ఎస్సై బి.రాజేష్ కుమార్, ఆమె బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లిలోని ముక్తేశ్వరంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఒంటరిగా ఉంటున్న 70 ఏళ్ల చంద్రమౌళి సత్యవతి ఇంట్లోకి బుధవారం తెల్లవారుజామున ఓ గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఆమె మెడలో నాలుగున్నర కాసుల బంగారు గొలుసును లాక్కుని పరరయ్యాడు. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

### ఐరెన్, హార్డ్‌వేర్ అసోసియేషన్ మాజీ నేత 'పేరూరి' మృతి



పేరూరి సుబ్బారావు (ఫైల్)

**అమలాపురం టౌన్:** పట్టణంలోని ఐరెన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ కోశాధికారి, పట్టణ వైశ్య సంఘ సీనియర్ నాయకుడు పేరూరి సుబ్బారావు (94) మంగళవారం రాత్రి వృద్ధాప్యంతో తన స్వగృహంలో మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గతంలో సుబ్బారావు స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం ధర్మకర్తల మండలి సభ్యుడిగా పనిచేశారు. ఆయన పలు సేవా కార్యక్రమాలు చేశారు. పట్టణంలోని వ్యాపార సంఘాల ప్రతినిధులు స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులోని దివంగత సుబ్బారావు ఇంటికి బుధవారం వెళ్లి సంతాపం తెలిపారు.

### ఎన్డీయే కూటమి గెలుపుతో యానాం అభివృద్ధి

**ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్**

**యానాం:** పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గానికి బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నమశ్శివాయం గెలుపుతో యానాం అభివృద్ధికి మరింత సహకారం లభిస్తుందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరికి వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న యానాంలో మౌలిక సౌకర్యాలు ఇంకా కల్పించాల్సి ఉందని, ఆ విధంగా వివిధ కాలనీల్లో ఇప్పటికీ రహదారులు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సౌకర్యాలు లేవని, ఈ సమస్యలన్నీ పరిష్కారిస్తామన్నారు. ఇప్పటికే ఇళ్ల పట్టాలకు స్థల సేకరణ చేశామని, ఇళ్ల పట్టా పంపిణీకి నమశ్శివాయం చర్యలు తీసుకుంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా పర్యాటకాభివృద్ధికి నిధులు, మెడికల్ కళాశాల స్థాపన, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు తదితర అంశాలు త్వరలో సాకారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండు సిద్ధార్థ, నక్కల సుబ్బన్న, కాకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రోడ్‌షోకు భారీ స్వాగత ఏర్పాట్లు



రావులపాలెం సెంటర్‌లో కట్టిన వైఎస్సార్ సీపీ జెండా తోరణాలు




రావులపాలెం సెంటర్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, జగ్గిరెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- నాలుగు మండలాల నుంచీ ఉత్సాహంగా తరలిరానున్న పార్టీ శ్రేణులు

**కొత్తపేట/రావులపాలెం:** వైఎస్సార్ సీపీ, అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు కొత్తపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. సీఎం జగన్ బస్సుయాత్ర షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపాన తేతలి నుంచి జాతీయ రహదారి మీదుగా జగన్ బస్సు యాత్ర ప్రారంభమౌతుంది. ఉదయం 9 గంటలకు అక్కడ బయలుదేరిన బస్సు యాత్ర సుమారు 10 గంటలకు సిద్ధాంతం బ్రిడ్జి దాటి నియోజకవర్గంలో కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం చేరుకుంటుంది. అక్కడ ఎమెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి రోడ్ షో ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి గోపాలపురం, ఈతకోట, మల్లాయిదొడ్డి సెంటర్, సోమసుందరరెడ్డి నగర్, రావులపాడు, మీదుగా సుమారు 10.30 గంటలకు రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకుంటుంది. అక్కడ నుంచి గౌతమీ బ్రిడ్జి మీదుగా ఆలమూరు మండలం జొన్నాడ సెంటర్, మూలస్థానం, చొప్పెల్ల, చెముడులంక, మడికి, పొట్టిలంక వరకూ యాత్ర సాగుతుంది. కడియపులంకలో మధ్యాహ్నం 12.30 గంటలకు భోజన విరామం ఉంటుంది. కాగా జాతీయ రహదారి పొడవునా ముఖ్యంగా పై గ్రామాల కూడళ్లలో పార్టీ శ్రేణులు, అభిమానులు జననేత జగన్‌కు భారీగా స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. దారి పొడవునా పార్టీ జెండాలతో తోరణాలు కట్టారు. జగన్, జగ్గిరెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బస్సుయాత్ర రావులపాలెం, ఆలమూరు మండలాల మీదుగా మాత్రమే సాగుతున్నందున మిగిలిన కొత్తపేట, ఆత్రేయపురం మండలాల నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ షోకు భారీగా తరలిరావడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా సిద్ధమయ్యారు. ఆ మేరకు భారీ మోటార్‌సైకిళ్లు, ఆటోల్లో తరలివచ్చి జగన్ బస్సుకు ముందు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ముఖ్యంగా రావులపాలెం కళా వెంకటరావు సెంటర్‌లో జగన్‌కు భారీ స్వాగతం, బ్రహ్మరథం పట్టాలని ఉత్సాహంగా ఉన్నారు. అలాగే అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసి సంక్షేమ ప్రదాతగా నిలిచిన జగన్‌ను చూడాలని ప్రజలు కూడా ఉత్సాహంగా తరలిరానున్నారు.

### అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలన



అప్పనరామునిలంకలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో మాట్లాడుతున్న గొల్లపల్లి

**సఖినేటిపల్లి:** రాష్ట్రంలో గత ఐదేళ్లలో అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలనను సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందించారని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం అప్పనరామునిలంకలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి బూత్‌లలో ఓటింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన విధానాలపై జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్ ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కోర్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం పేరుతో ఈ సదస్సు జరిగింది. గొల్లపల్లి మాట్లాడుతూ, ఆయన గెలిస్తేనే పేదలకు మళ్లీ సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయి అన్న విషయాన్ని ప్రతి ఒక్కరికీ చాటి చెప్పాలని అన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, పెదపాటి నాగలక్ష్మి, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, బర్రే రాము, తాడి సహదేవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్యాణం.. కమనీయం

- వైభవంగా సీతారాముల కల్యాణం
- గ్రామ గ్రామాన శ్రీరామనవమి వేడుకలు
- రామనామ స్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు



అయినవిల్లిలో సీతారాములకి విశేష పూజలు చేస్తున్న అర్చకులు



మలికిపురంలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు



ఊబలంకలో సీతారామచంద్రస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

**కొత్తపేట:** వేద పండితుల మంత్రోచ్చారణలు.. మంగళవాయిద్యాలు.. భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య సీతారాముల కల్యాణ మహోత్సవాలు కడు రమణీయం.. కమనీయంగా జరిగాయి. శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని బుధవారం గ్రామ గ్రామాన, వాడవాడలా సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. రామాలయాలు, ఆంజేయస్వామి ఆలయాలు, వైష్ణవ క్షేత్రాలు శ్రీరామ నామస్మరణతో మారుమోగాయి. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం కనులపండువగా జరిపారు. కొత్తపేటలోని కోదండరామస్వామి వారి ఆలయం (కొత్తరామాలయం)లో ఆ ఆలయ ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు పర్యవేక్షణలో సిద్ధంశెట్టి సత్యవరప్రసాద్-అనంతలక్ష్మి దంపతులతో వేదపండితులు ఖండవిల్లి ఆంజనేయాచార్యులు (అంజిబాబు) ఆగమ శాస్త్రం ప్రకారం వేద మంత్రోచ్చారణ, వ్యాఖ్యానం నడుమ ప్రధానం ఘట్టం నుంచి తలంబ్రాల వరకూ కల్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. పలువురు భక్తులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, ప్రసాదాలు సమర్పించారు. అనంతరం బెల్లం పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు. కొత్తపేట, పలివెల పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు, కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

**మామిడికుదురులో..**

**మామిడికుదురు:** మండలంలో శ్రీరామనవమిని వైభవంగా నిర్వహించారు. మండలంలోని 18 గ్రామాల్లో వాడవాడలా సీతారాముల కల్యాణాన్ని భక్తులు అంగరంగ వైభవంగా జరిపించారు. మామిడికుదురు గాంధీ విగ్రహం వద్ద ఉన్న శ్రీకోదండ రామాలయంలో పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొని సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ పలు గ్రామాల్లో సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు భారీ ఊరేగింపుగా వెళ్లి మంగళ సూత్రాలను తీసుకు వచ్చారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా భక్తులకు వడపప్పు, చలిమిడి, పానకం అందించారు. శ్రీరామ నవమి సందర్భంగా పలు గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

**అంబాజీపేటలో..**

**అంబాజీపేట:** తరతరాలు, అన్ని యుగాలకు ఆదర్శ ప్రాయుడిగా శ్రీరామచంద్రుడ్ని కొలుస్తామని, అందుకు ఆయన గుణశీలాలే కారణమని పలువురు వేద పండితులు పేర్కొన్నారు. మండలంలో శ్రీసీతారామ కల్యాణ మహోత్సవ వేడుక బుధవారం కనుల పండువగా జరిగింది. కల్యాణ, పట్టాభిషేక మహోత్సవాలు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులకు పానక ప్రసాదాలు, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

**మలికిపురంలో..**

**మలికిపురం:** శ్రీరామ నవమి వేడుకలు మండలంలో బుధవారం వైభవంగా జరిగాయి. మలికిపురంలో జరిగిన సీతారామ కల్యాణ వేడుకల్లో రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు కేవీ చంటిరాజు, కేఎస్ఎన్ రాజు, గెడ్డం తులసీ భాస్కరరావు, ముప్పర్తి త్రిమూర్తులు, కుడుపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కేశనపల్లిలో జరిగిన సీతారామ కల్యాణాన్ని ముద్దాల రాధాకృష్ణ-భవ్యశ్రీ దంపతులతో అర్చకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**రావులపాలెంలో..**

**రావులపాలెం:** మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద సీతారాముల కల్యాణ వేడుకలు జరిగాయి. రావులపాలెంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పడాల కొండారెడ్డి-లీలావతి దంపతులు, భాస్కరరెడ్డి-సుస్మిత దంపతులు కల్యాణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పెద్దింటి పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ పూజలు నిర్వహించారు. స్వామివారికి ముత్యాల తలంబ్రాలు కనుకగా సమర్పించారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నృత్యగానాలు, విచిత్ర వేషధారణలు, కోలా ప్రదర్శనలు బాజాభజంత్రీలు నడుమ రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో సీతాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, చిన కేవీ, మల్లిడి కోటేశ్వరరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన జగ్గిరెడ్డి**

**రావులపాలెం:** మండలంలోని పలు రామాలయాల్లో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా కొత్తపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. లక్ష్మీ పోలవరం ఎస్సీ పేట రామాలయం, రావులపాడు శివారు పూరేటి వారి చెరువు, ఊబలంకలో రామాలయం, గోపాలపురం బ్రాహ్మణ రామాలయం, పట్టాభిరామ రెడ్ల రామాలయం, తేతలి వారి రామాలయాల్లో జరిగిన సీతారాముల కల్యాణంలో జగ్గిరెడ్డి పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించి వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.

**ఆలమూరులో..**

**ఆలమూరు:** శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగిపోయాయి. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని చొప్పెల్ల, పెదపళ్లలో వేంచేసిన రామాలయాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అయినవిల్లిలో..**

**అయినవిల్లి:** స్థానిక సీతారామచంద్రస్వామివారి ఆలయంలో వైభవంగా శ్రీరామనవమి, స్వామివారి కల్యాణం వైభవంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమం వీక్షించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నల్లచెరువు, వెంకటేశ్వరస్వామి, అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్‌లో ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే అయినవిల్లి, సిరిపల్లి, ముక్తేశ్వరం పాలెం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిపారు.

**పి.గన్నవరంలో..**

**పి.గన్నవరం:** సీతారామస్వామివారి కల్యాణ మహోత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైభవంగా నిర్వహించారు. పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్లో సీతారామ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వర్తక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కార్యదర్శి రాలింగి రామకోటేశ్వరరావు, గిడుగు బాబ్జీ, ప్రకాష్, షణ్ముఖ్, యడ్లపల్లి నారాయణమూర్తి, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు. స్థానిక డీఎస్ పాలెంలో రామాలయం వద్ద భక్తులకు అన్న సమారాధన చేశారు.

**ఆత్రేయపురంలో..**

**ఆత్రేయపురం:** మండలంలోని ఆత్రేయపురం పెద్ద రామాలయం, చిన్న రామాలయం, హనుమాన్ జంక్షన్, అంకంపాలెం, వెలిచేరు, లొల్ల, పేరవరం, రాజవరం, ర్యాలి తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం కన్నులపండువగా జరిగాయి. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఉంచి ఆయా గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు.



కొత్తపేట కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్త దంపతులు



మామిడికుదురులో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న భక్త దంపతులు



రావులపాలెం సీతారామచంద్రస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

# చంద్రబాబు ఏనాడూ మేనిఫెస్టో అమలు చేయలేదు

**వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు**



పార్టీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

**మలికిపురం:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రకటించిన మేనిఫెస్టోను చంద్రబాబు నాయుడు ఏనాడూ అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మలికిపురం మండలం మలికిపురంలో చింతా ప్రవీణ్ ఆధ్వర్యంలో గొల్లపల్లి సూర్యారావు సమీక్షంలో వీవీ మెరక గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీ యువ కార్యకర్తలు ఆయా పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. సూర్యారావు వారికి వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ చక్కని పాలన అందిస్తున్న జగన్‌ను ఓడించేందుకే దుష్టశక్తులన్నీ ఏకమై కూటమి పేరుతో దిగాయన్నారు. ప్రజలను దగా చేసే కూటమి అని అన్నారు. సీఎం జగన్ ఇచ్చిన, అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తామని చెప్పే ధైర్యం కూడా లేని ప్రతి పక్షాల కూటమి ప్రజలకు మేలు చేస్తామని బోగస్ ప్రకటలను చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో కొల్లాబత్తుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లను చైతన్యపరిచేలా...



మొక్క నాటుతున్న ఆర్‌ఓ మునిస్వామి, సిబ్బంది

**యానాం:** పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి శుక్రవారం పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కార్బన్ న్యూట్రల్ కార్యక్రమాన్ని బుధవారం యానాం లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఐటీఐ ప్రాంగణం లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి, వ్యవసాయ అధికారులు పలువురు మొక్కలను నాటారు. పర్యావరణాన్ని కాపాడేలా గ్లోబల్ వార్మింగ్‌కు దారి తీసే గ్రీన్‌హౌస్ వాయువు మొత్తమైన కార్బన్ ఫుట్‌ప్రింట్స్‌ను తగ్గించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మొత్తం ఈ ఎన్నికల ప్రక్రియ పరంగా వచ్చే చెత్త, విద్యుత్ వినియోగం, ఇంధన వినియోగం, అదేవిధంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఫలితాలు వెలువడే వరకు వినియోగించిన మెటీరియల్స్ తదితర వాటిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్, ఎకాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌సెస్ శాఖలు పుదుచ్చేరి యూనివర్సిటీ లెక్కిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వాడకం తగ్గిద్దాం

**పచ్చిరొట్టతో భూసారం పెరుగుదల**



గంగలకుర్రులో పచ్చిరొట్ట పైరు

**అంబాజీపేట:** రబీ వరికోతలు పూర్తవగానే మూడో పంటగా పచ్చిరొట్టను సాగు చేస్తే భూమిలో సారవంతం పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎక్కడ చూసినా విచక్షణ రహితంగా రసాయన ఎరువుల వాడకం పెరిగిపోయింది. రసాయన ఎరువుల అధిక వినియోగం, పంటల మార్పిడి విధానాన్ని పాటించకపోవడం వలన భూసారం కోల్పోతున్న విషయాన్ని రైతులు గుర్తించడం లేదు. గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పైరు పెంపకం తగ్గిపోయింది. దీని వలన భూసారం తగ్గి పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. రైతులు తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన పదార్థాలను పిచికారీ చేసి అనర్థాలను కొనితెచ్చుకుంటున్నారు. రబీ పంట అనంతరం పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది. అలాగే కొబ్బరి తోటల్లోను పచ్చిరొట్ట పైరును రైతులు పెంచుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 600, కొత్తపేట నియోజకవర్గంలో 750, రాజోలులో 976 ఎకరాల్లో జీలుగ, పిల్లిపెసర, జనుము సాగు చేపట్టారు.

**స్థూల పోషకాలు అధికం**

జనుము, జీలుగ, పిల్లిపెసర, తదితర రకాలను రబీ పంట అనంతరం సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. అలాగే నేలలు సంపూర్ణమై ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికి తీస్తాయి. సేంద్రియ కర్బనం పెరుగుతుంది. ఈ పైర్ల సాగు వలన 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. గుళికలను అధికంగా వాడడం వలన భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నాయి. పంటల పెరుగుదలకు ఉపయోగమైన సూక్ష్మజీవులు నశించడం వలన దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వలన తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

**సద్వినియోగం చేసుకోవాలి**



రాబోయే తరాలకు భూమిని సారవంతంగా ఉంచాలంటే పచ్చిరొట్ట ఎరువులు వేయాలి. ప్రధాన ఎరువులకు చేసే ఖర్చును తగ్గించుకుని, నికర లాభం పొందడానికి వీలవుతుంది.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏవో, అంబాజీపేట